ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



ప్రతి ఒక్కరూ రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలి

మిరుదొడ్డి, ఫిబ్రవరి 27: ప్రతిఒక్కరూ రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలని డీబీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బీమ్ శేఖర్ తెలిపారు. మిరుదొడ్డి కస్తూర్బాగాంధీ పాఠశాలలో మంగళవారం రాజ్యాంగంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వర్ణలత, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

మా ట లు మం ట లు



సంజయ్‌వి.. రాజకీయ డ్రామాలు

కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ రాజకీయ డ్రామాలతో ప్రజాహిత యాత్ర చేస్తున్నాడు. ఆయన యాత్రకు ప్రచారం రావాలని.. కాంగ్రెస్ అడ్డుకుంటుందని డ్రామాలకు తెరలేపాడు. రాముడి గురించి, అక్షింతల గురించి మాట్లాడితే సజీవ సమాధికి సిద్ధం.

- హుస్నాబాద్‌లో విలేకరులతో మంత్రి పొన్నం ప్రభాకర్

నేను ఓడిపోతే రాజకీయ సన్యాసం

మంత్రి పొన్నంకు సవాల్ విసురుతున్నా.. నేను నా విశ్వాసాలతో రాముడి పేరిట ఎంపీ ఎన్నికల్లో నిల్చుంటా. నువ్వు నీ వాదనతో నీ అభ్యర్థిని నిలబెట్టు. నేను ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటా.. నేను ఎక్కడా.. ఎవరినీ వ్యక్తిగతంగా విమర్శించలేదు.

- హుస్నాబాద్‌లో ప్రజాహితయాత్రలో ఎంపీ బండి సంజయ్



ఆగ్రహజ్వాల

సిద్దిపేట జిల్లాలో కాంగ్రెస్ వర్సెస్ బీజేపీల మధ్య మాటల మంటలు రాజుకున్నాయి. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్.. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ మంగళవారం కాంగ్రెస్ శ్రేణులు ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశాయి. పలు చోట్ల ఆయన దిష్టిబొమ్మలను దహనం చేశారు. పోలీసులకూ ఫిర్యాదు చేశారు. మరోపక్క, బండి సంజయ్ చేపట్టిన ప్రజాహితయాత్రను అడ్డుకునేందుకు ప్రయత్నించడం, బీజేపీ నాయకులపై దాడులకు తెగబడటం అప్రజాస్వామికమని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు.




అక్కన్నపేటలో ఎంపీ బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నకిలీ ఎర


పత్తి రైతులు.. తస్మాత్ జాగ్రత్త

- వానాకాలం సీజన్‌పై అక్రమార్కుల కన్ను
- జిల్లాలో 1.50 లక్షల ఎకరాల్లో పత్తిసాగు
- సుమారు 5 లక్షల ప్యాకెట్లు అవసరం
- ఇటీవలే వెలుగుచూసిన విత్తనదందా
- నిఘా పెంచితేనే అక్రమాల నియంత్రణ

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఫిబ్రవరి 27: వచ్చే వానాకాలం సాగుపై ఆశలు పెట్టుకున్న పత్తిరైతులు అప్రమత్తం కావాల్సిన సమయం ఆసన్నమైంది. రైతులను మోసం చేయడానికి అక్రమార్కులు పన్నుతున్న వ్యూహాలు అంతుచిక్కడం లేదు. ఊరుపేరు లేని విత్తనాల గురించి గొప్పగా చెప్పి రైతులకు అంటగట్టే ప్రయత్నాలు జరుగుతున్నట్లుగా తెలుస్తున్నది. ఇటీవల భారీ స్థాయిలో పట్టుబడిన పత్తి విత్తన నిల్వలే ఇందుకు నిదర్శనం.



సిద్దిపేట జిల్లాలో వరి తర్వాత పత్తి సాగు అధికంగా ఉంటుంది. వానాకాలం సీజన్‌కు సంబంధించి ఏప్రిల్, మే నెలల్లోనే రైతులు తమ భూములను చదును చేసి సాగుకు సిద్ధమవుతారు. వర్షాలు కురవగానే పత్తిగింజలు నాటుతారు. ఒక్కోసారి పత్తి విత్తనాల కొరత తలెత్తే పరిస్థితులు ఉండడంతో ముందస్తుగానే కొనుగోలు చేసి నిల్వ పెట్టుకుంటారు. ఈ పరిణామాన్ని కొంతమంది దళారులు, అక్రమార్కులు ఆసరా చేసుకుంటున్నారు. అత్యధిక దిగుబడినిచ్చే విత్తనాలు తమ వద్ద ఉన్నాయంటూ రైతులకు ముందస్తుగానే అంటగట్టడానికి గ్రామాల్లో రంగప్రవేశం చేస్తున్నారు.



1.50లక్షల ఎకరాల్లో పత్తిసాగు

జిల్లావ్యాప్తంగా 5.50 లక్షల ఎకరాల్లో సాగు విస్తీర్ణం ఉండగా ఇందులో సుమారు 1.50 లక్షల ఎకరాల్లో పత్తిసాగు చేస్తారని అంచనా. ఎకరాకు 2 నుంచి 3 పత్తి విత్తన ప్యాకెట్లను వినియోగించాల్సి ఉంటుంది. వర్షాభావ పరిస్థితుల కారణంగా విత్తనాలు మొలకెత్తకుంటే మళ్లీ విత్తాల్సిన ఉంటుంది. ఈ లెక్కన జిల్లాలోని రైతులకు 5 నుంచి 6 లక్షల పత్తిగింజల ప్యాకెట్లను అందుబాటులో ఉంచక తప్పదు. ప్యాకెట్లను జిల్లాలోని ఫర్టిలైజర్ దుకాణాలు, అగ్రోస్ సెంటర్ల ద్వారా రైతులకు విక్రయిస్తుంటారు. అనుమతి పొందిన షాపుల్లో కొనుగోలు చేసిన విత్తనాలకే వ్యవసాయ శాఖ బాధ్యత వహిస్తుంది. 450 గ్రాముల పత్తి విత్తనాలు ఉన్న ఒక్కో ప్యాకెట్‌ను రూ.853కు విక్రయిస్తారు. ఈ ప్యాకెట్‌పై కంపెనీ చిరునామా, లేబుల్‌తో పాటు అన్ని వివరాలు ఉంటాయి.



హుస్నాబాద్ ప్రాంతంలో పట్టుబడిన నకిలీ పత్తివిత్తనాలు

అక్రమార్కుల రంగప్రవేశం

వానాకాలం సాగులో సమీపిస్తున్న నేపథ్యంలో విత్తనదందాలు నిర్వహించే అక్రమార్కులు జిల్లాలో రంగప్రవేశం చేస్తున్నారు. తాజాగా హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్‌లో 1450 కిలోల పత్తి విత్తనాలు పట్టుబడడం సంచలనం సృష్టించింది. ఎలాంటి ఆధారాలు లేకుండా సాధారణ సంచుల్లో విత్తనాలను నిల్వచేశారు. ఈ విత్తనాలను రైతులకు అంటగట్టడానికే నిల్వచేసినట్లుగా తెలుస్తున్నది. అధిక దిగుబడి పేరిట రైతులకు శఠగోపం పెట్టిన సందర్భాలు గతంలోనూ అనేకం ఉన్నాయి. ప్రస్తుతం పట్టుబడిన విత్తనాలు నకిలీవా? లేదా నిషేధంలో ఉన్న బీటీ-3 గింజలా అనేది తేలాల్సి ఉంది. బీటీ-3 విత్తనాలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి లేదు. వీటిని కొంతమంది అక్రమంగా రైతులకు విక్రయిస్తున్నారు. కానీ ఈ వ్యవహారమంతా గుట్టుగానే సాగుతున్నది. పలు చోట్లా రైతులు సైతం అధిక దిగుబడి ఆశతో వీటివైపు మొగ్గుచూపిస్తున్నట్లుగా ప్రచారం జరుగుతున్నది.

నిఘా పెంచితేనే

సాధారణంగా వానాకాలం సీజన్‌లో పోలీసులు, వ్యవసాయ అధికారుల సమన్వయంతో మానిటరింగ్ బృందాలను ఏర్పాటు చేస్తారు. ఫర్టిలైజర్, అగ్రోస్ సెంటర్లను తనిఖీలు చేస్తుంటారు. అయితే క్షేత్రస్థాయిలో నిఘా విస్తరిస్తేనే నకిలీ విత్తన దందాను పసిగట్టే అవకాశాలున్నాయి. ఇటీవల పట్టుబడిన విత్తనాల గురించి కూడా ఆ దందాకు సంబంధించిన వ్యక్తులే సమాచారం ఇచ్చినట్లు తెలుస్తుంది. రైతులు విత్తనాలను ఎక్కడెక్కడ కొనుగోలు చేస్తున్నారు? ఎన్ని ఎకరాలకు ఏ పరిమితిలో కొనుగోలు చేస్తున్నారు? అనే అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం జిల్లాలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఈ విత్తన దందాను బట్టబయలు చేశారు. సదరు నిందితులను సక్రమంగా విచారణ జరిపితే మరిన్ని అక్రమాలను చేధించే అవకాశాలు లేకపోలేదు. సీజన్ సమీపించినప్పుడే స్పందించే బదులు ముందస్తుగానే విత్తన దందాలపై ఫోకస్ పెట్టడం వల్ల రైతులకు మేలు చేసినట్లవుతుంది. సాధారణంగా మార్చిలోనే తమ దందాను పూర్తిచేసేలా ప్రణాళిక సిద్ధం చేసుకుంటారని వినికిడి.

'మల్లన్న' బుకింగ్ ఆదాయం రూ.37.79లక్షలు

- కొమురవెల్లికి ఆరోవారం భారీగా తరలివచ్చి భక్తుల మొక్కుల చెల్లింపు

చేర్యాల, ఫిబ్రవరి 27 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా ఆరోవారాన్ని పురస్కరించుకుని భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ మేరకు రూ.37.79 లక్షల మేర బుకింగ్ ఆదాయం సమకూరినట్లు ఆలయవర్గాలు తెలిపాయి. భక్తులు మొక్కుబడిగా సమర్పించిన తలనీలాలు అలాగే ఆర్జితసేవలు, పట్నాలు, బోనాలు, ప్రసాద విక్రయాలు, ప్రత్యేక దర్శనాలు, వసతి గదుల అద్దె తదితరాల ద్వారా శనివారం రూ.4,18,183, ఆదివారం రూ.29,16,201, సోమవారం రూ.4,45,005 చొప్పున మొత్తం రూ.37,79,389 ఆదాయం సమకూరిందని ఈవో బాలాజీశర్మ తెలిపారు.



మల్లన్న ఆలయ ఆవరణలో భక్తుల రద్దీ

సాదాబైనామాలకు మోక్షమెప్పుడో?

- ఏళ్లుగా ఎదురుచూస్తున్న రైతులు
- 'ఎల్‌ఆర్‌ఎస్'కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో చిగురిస్తున్న ఆశలు

గజ్వేల్, ఫిబ్రవరి 27: వ్యవసాయ భూముల కొనుగోలుకు సంబంధించి సాదాబైనామాల (తెల్లకాగితాల) పై మాత్రమే ఉన్న ఒప్పందాలు చట్టబద్ధం కాకపోవడంతో పట్టాల పేరు మార్పిడికి రైతులు ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నారు. సాదాబైనామా కింద కొనుగోలు చేసిన భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు.

చాలా ప్రాంతాల్లో తెల్ల కాగితాలపై ఒప్పందాలు చేసుకున్నారు. సాదాబైనామాతో ఏళ్ల క్రితం భూమి కొనుగోలు చేసిన రైతులు ప్రస్తుతం వారి పేరున రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు తిప్పలు పడుతున్నారు. సాదాబైనామాలకు చట్టబద్ధం కల్పించేందుకు గత ప్రభుత్వం అవకాశం ఇవ్వగా వేల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. అయితే, రెవెన్యూ అధికారులు మాత్రం కొన్నింటికే పరిష్కారం చూపించారు. ఇక రికార్డుల్లో పేర్లు లేకపోవడంతో అప్పటికే భూములను సాగుచేసుకుంటున్న రైతులకు వాటి పట్టాదారుల నుంచి సమస్యలు తప్పలేదు. ప్రస్తుతం సాగులో ఒకరు, రికార్డుల్లో మరొకరు, సాదాబైనామాలో ఇంకొకరు ఉండడంతో వారసుల కుటుంబ సభ్యుల నుంచి అభ్యంతరాలు ఎదురయ్యాయి. ఏళ్లుగా ఈ సమస్య ఉండగా, గత ప్రభుత్వం సాదాబైనామాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ సాదాబైనామాలకు వేల సంఖ్యలో దరఖాస్తులు రావడం.. పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తూ కోర్టుకు వెళ్లడంతో తాత్కాలికంగా సాదాబైనామాల అంశాన్ని గత ప్రభుత్వం మూడేళ్ల క్రితమే సాదాబైనామాల అంశాన్ని పెండింగ్‌లో పెట్టింది.



మూడు మండలాలకు దక్కని అవకాశం

గత ప్రభుత్వ హయాంలో సాదాబైనామా దరఖాస్తులను స్వీకరించిన సర్కారు పలు నిబంధనలను విధించింది. హెచ్ఎండీఏ, మునిసిపల్ ప్రాంతాల్లోని ప్రజలకు సాదాబైనామాలకు అవకాశం కల్పించలేదు. దీంతో, జిల్లాలో హెచ్ఎండీఏ (హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ) పరిధిలో ఉన్న ములుగు, మర్కుక్, వర్గల్ మండలాల రైతులకు అవకాశం దక్కలేదు. సిద్దిపేట, హుస్నాబాద్, చేర్యాల, దుబ్బాక, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీల పరిధిలోని గ్రామాల ప్రజలకు దరఖాస్తు చేసుకునే అవకాశం లేకుండా పోయింది.

జిల్లాలో భారీగా దరఖాస్తులు

జిల్లాలోని 26 మండలాల పరిధిలో చేపట్టిన సాదాబైనామాల స్వీకరణలో దాదాపుగా 12వేల పైగా దరఖాస్తులు వచ్చాయి. ఈ క్రమంలో పలు అభ్యంతరాలు రావడంతో గత ప్రభుత్వం సాదాబైనామాలకు చట్టబద్దత కల్పించే అంశాన్ని పెండింగ్‌లో పెట్టింది. 2021 జనవరి వరకు అవకాశం కల్పించిన అప్పటి ప్రభుత్వం అనంతరం ఈ అంశాన్ని నొక్కి పెట్టింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్‌పై కీలక నిర్ణయం తీసుకోగా, సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారానికి ఎదురుచూస్తున్న రైతుల్లో ఆశలు గురించాయి. ధరణి స్థానంలో భూమాతను తీసుకొచ్చి ఆర్ఓఆర్ చట్టంలో మార్పులకు ప్రయత్నిస్తున్న కాంగ్రెస్ సాదాబైనామాలపై ఏదైనా సానుకూల నిర్ణయం తీసుకుంటుందా అనే విషయమై అందరూ ఎదురుచూస్తున్నారు.

అల్యూమినియం దొంగల అరెస్ట్

- ఆటో, మోటార్ సైకిల్, 1280 కేజీల కండక్టర్ వైర్ స్వాధీనం

కొండపాక, ఫిబ్రవరి 27: సిద్దిపేట జిల్లాలోని పలు ప్రాంతాల్లోని వెంచర్లలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాల్లోని అల్యూమినియం వైర్లను చోరీకి పాల్పడుతున్న ముగ్గురు దొంగలను తొగుట సీఐ లతీఫ్, కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ మంగళవారం పట్టుకున్నట్లు గజ్వేల్ ఏసీపీ బాలాజీ తెలిపారు. వారి నుంచి ఆటో, మోటార్‌సైకిల్, మూడు సెల్‌ఫోన్లు, వైర్‌కట్టర్, 1280 కేజీల అల్యూమినియం కండక్టర్ వైర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు.

వెలికట్ట శివారులోని ఒక వెంచర్‌లో విద్యుత్ వైరు చోరీ చేసిన విషయమై ఈనెల 19న పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు అందింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ ప్రారంభించారు. మంగళవారం ఉదయం వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద సీఐ లతీఫ్, కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ తమ సిబ్బందితో వాహనాల తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఆటోలో ముగ్గురు వ్యక్తులు అల్యూమినియం వైర్‌తో వెళ్తుండగా అనుమానం వచ్చి విచారించగా.. దొంగతనం చేశామని ఒప్పుకున్నారు. దూళిమిట్ట మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన గుగులోతు చంద్రశేఖర్, కరీంనగర్ జిల్లా కేశవపట్నం గ్రామానికి చెందిన అగుళ్ల శ్రీనివాస్, హుజూరాబాద్‌కు చెందిన కడారి జలంధర్ కలిసి చోరీలకు పాల్పడినట్లు విచారణలో తేలిందని ఏసీపీ వివరించారు. గుగులోతు చంద్రశేఖర్ నూతనంగా నిర్మించే ఇళ్లలో విద్యుత్ వైరింగ్ చేస్తూ జీవించేవాడు. జల్సాలకు అలవాటు పడిన చంద్రశేఖర్ కొత్తగా ఏర్పాటు చేసిన వెంచర్ల వద్ద కరెంటు అల్యూమినియం వైర్ దొంగిలించి అమ్మితే ఎక్కువ డబ్బు వస్తుందనే ఆశతో స్నేహితులైన అగుళ్ల శ్రీనివాస్, కడారి జలంధర్‌కు విషయం చెప్పడంతో వారు ఒప్పుకున్నారు. గుగులోత్ చంద్రశేఖర్ తన మోటార్ సైకిల్‌పైన ఎక్కడెక్కడ నూతనంగా వేసిన వెంచర్లు ఉన్నాయో గమనించేవాడు. ఆ తర్వాత ముగ్గురు కలిసి దొంగతనాలకు పాల్పడేవారు. ప్రజ్ఞాపూర్ రింగ్ రోడ్డు వద్ద ఉన్న వెంచర్లో విద్యుత్ స్తంభాలకు ఉన్న కరెంటు వైర్ కట్‌చేసి ప్రజ్ఞాపూర్‌లో ఉన్న స్క్రాప్ దుకాణంలో అమ్మారు. తర్వాత కుకునూరుపల్లి మండలంలోని తిప్పారం దారిలో నిర్మించిన వెంచర్‌లోని విద్యుత్ స్తంభాల వైర్లను చోరీ చేశారు. మెదినీపూర్ శివారులోని వెంచర్లో విద్యుత్ వైర్లను కట్‌చేసి తీసుకువెళ్లి సిద్దిపేటలోని ఓ స్క్రాప్ దుకాణంలో అమ్మారు. వెలికట్ట శివారులోని వెంచర్లో, అలాగే వరంగల్ జిల్లా ఎల్కతుర్తి వెంచర్‌లో, కరీంనగర్ జిల్లా మానకొండూరు శివార్లలోని వెంచర్లలో విద్యుత్ వైర్లను చోరీ చేశారు. ఈ ముగ్గురిపై ఏడు దొంగతనాల కేసులు నమోదయ్యాయని, నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. వారి నుంచి స్వాధీనం చేసుకున్న వైర్ విలువ రూ.32 వేల వరకు ఉంటుందని తెలిపారు. సీపీ అనురాధ సూచనలతో ఏసీపీ బాలాజీ పర్యవేక్షణలో నిందితులను చాకచక్యంగా పట్టుకుని కేసు చేధించిన తొగుట సీఐ లతీఫ్, కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుళ్లు రమణమూర్తి, యాదగిరి, కానిస్టేబుళ్లు రమేష్, రాజు, కరుణాకర్‌ను ఏసీపీ అభినందించారు. రివార్డు కోసం ప్రపోజల్ పంపిస్తున్నట్లు తెలిపారు.



వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ బాలాజీ

ఆ పార్టీలకు ఓటేస్తే మోరీలో వేసినట్లే

- రాష్ట్రవ్యాప్తంగా 90 లక్షల మంది గ్యాస్ లబ్ధిదారులకు న్యాయం చేయాలి
- ప్రజాహిత యాత్రలో ఎంపీ బండి సంజయ్

అక్కన్నపేట, ఫిబ్రవరి 27: "ప్రజలను మోసం చేసే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఓటు వేస్తే మోరీలో వేసినట్లే.. మాయమాటలు చెప్పే వారిని నమ్మి మరోసారి మోసపోకూడదు" అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ పేర్కొన్నారు. మంగళవారం రాత్రి అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి, నందారం, రామవరం, గండిపల్లి, అక్కన్నపేటలో ప్రజాహిత యాత్ర నిర్వహించారు. అంతకన్నా ముందు హుస్నాబాద్, రామునిపల్లి, మహ్మదాపూర్, పోతారం.ఎస్, పందిళ్లలో ఈ యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా అక్కన్నపేటలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ అందరికీ సబ్సిడీ సిలిండర్ ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు మహిళల పేరు మీద ఉంటేనే ఈ పథకం వర్తిస్తుందంటూ ప్రజలను మోసం చేస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 90లక్షల మంది గ్యాస్ లబ్ధిదారులు ఉన్నారని, వారందరికీ రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలకు రేషన్ కార్డు తప్పనిసరి అని చెబుతున్న ప్రభుత్వం 10లక్షల కుటుంబాలకు రేషన్‌కార్డులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ప్రజాసమస్యలపై కొట్లాడితే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం తనపై 100 కేసులు పెట్టిందని, జైలుకు కూడా వెళ్లి వచ్చానని ఈ సందర్భంగా గుర్తుచేశారు. మీ కోసం కొట్లాడే వ్యక్తికి ఓటు వేసి మరోసారి గెలిపించాలని ఆయన కోరారు. గౌరవెల్లి ప్రాజెక్టు, కాలువలు పూర్తి చేయకుండా గత ప్రభుత్వం హుస్నాబాద్ నియోజకవర్గం ప్రజలను మోసం చేసిందని, న్యాయమైన పరిహారం అడిగితే భూనిర్వాసితులపై లాఠీచార్జి చేయించి జైలులో పెట్టారని ఆరోపించారు. మళ్లీ మోదీనే ప్రధాన మంత్రి కావాలని అప్పుడే దేశం బాగుంటుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం ప్రజాహిత యాత్ర అక్కన్నపేట నుంచి హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోకి ప్రవేశించింది. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొమ్మ శ్రీరాం చక్రవర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రామంచ మహేందర్‌రెడ్డి, నాయకులు గొల్లపల్లి వీరాచారి, కర్ణకంటి నరేష్ పాల్గొన్నారు.



అక్కన్నపేటలో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్



మృతుల కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ తదితరులు

అయ్యో పాపం

- నెల రోజుల్లో తండ్రవుతాడని సంతోషం.. అంతలోనే విషాదం
- చేతికొచ్చిన కొడుకులను కోల్పోయిన తల్లిదండ్రుల వేదన
- మూడు కుటుంబాల్లో విషాదం నింపిన రోడ్డు ప్రమాదం

జోగిపేట, ఫిబ్రవరి 27: సంగారెడ్డి జిల్లా జోగిపేట పట్టణ శివారులో సోమవారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదం మూడు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. ప్రమాదంలో జోగిపేటకు చెందిన మహ్మద్ వాజీద్ (27), హాజీ హుస్సేన్ (25), ముకర్రమ్ (23) మృతిచెందారు. మృతుల్లో ఒకరైన వాజీద్ భార్య నిండు గర్భిణి. ఆమె వచ్చే నెలలో బిడ్డకు జన్మనివ్వనున్నది. ఇంతలోనే భర్త మృత్యువాత పడడంతో తట్టుకోలేక అపస్మారక స్థితికి చేరుకుంది. వాజీద్ తల్లిదండ్రులు, భార్య రోదనలు అందరినీ కలచి వేసింది. అలాగే, చేతికి వచ్చిన కొడుకులు మృతిచెందడంతో హాజీ, ముకర్రంల కుటుంబ సభ్యులు కూడా గుండెలవిసేలా రోదించారు. ప్రమాదం జరిగిన సంగతి తెలుసుకున్న ఎస్ఐ అరుణ్ గౌడ్ సిబ్బందితో కలిసి ప్రమాద స్థలానికి చేరుకొని మృతదేహాలను జోగిపేటలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో రెండు కాళ్లు విరిగిన రిజ్వాన్‌ను జోగిపేట ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స చేశారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతుల కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి

ప్రమాదంపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ జోగిపేటలో ఏరియా ఆస్పత్రికి చేరుకుని మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. బీఆర్ఎస్ నాయకుడు వాజీద్ మృతి పార్టీకి తీరని లోటని, ఆయన కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు.

జోగిపేటలో విషాదఛాయలు

ప్రమాదంలో ముగ్గురు యువకులు దుర్మరణం పాలవడంతో జోగిపేటలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రమాద వార్త తెలిసిన వెంటనే మృతుల స్నేహితులు, కుటుంబ సభ్యులు ప్రమాద స్థలానికి తరలివచ్చారు. పోస్టుమార్టం అనంతరం అంత్యక్రియలకు పట్టణవాసులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న పరశురాములు

కొండపాక, ఫిబ్రవరి 27: అప్పుల బాధతో ఓ వ్యక్తి మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సిరిసిల్ల జిల్లా సారంపల్లి గ్రామానికి చెందిన బొప్పెన పరశు రాములు చిట్టీలు నిర్వహించి అప్పుల పాలయ్యాడు. బతుకు దెరువు కోసం కొన్నేళ్లు దుబాయ్‌కి వెళ్లి వచ్చినా అప్పులు తీరలేదు. దీంతో మనస్తాపం చెంది ఈనెల 23న తిరుపతికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. మంగళవారం ఉదయం కుకునూరుపల్లి మండలం లకుడారం శివారులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు ఆయన వద్ద ఉన్న ఆధార్‌కార్డు ఆధారంగా కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. భార్య కళావతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సిద్దిపేట ఆస్పత్రికి తరలించారు.

రైతుల ఖాతాల్లో రూ.5 కోట్లు జమచేశాం



కొత్తూర్(బి) గ్రామంలో గల ట్రైడెంట్ కర్మాగారం

జహీరాబాద్, ఫిబ్రవరి 27: జహీరాబాద్ మండలంలోని కొత్తూర్(బి) గ్రామంలో గల ట్రైడెంట్ చెరకు కర్మాగారం యాజమాన్యం మంగళవారం రూ.5 కోట్ల పెండింగ్ బకాయిలను రైతుల ఖాతాల్లో వేసిందని ట్రైడెంట్ కర్మాగారం డైరెక్టర్ ఖిజార్‌యాషై తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్మాగారం రైతులకు రూ.7.38 కోట్ల చెరకు బకాయిలను చెల్లించాల్సి ఉండగా.. ప్రస్తుతం రూ.5 కోట్లు జిల్లా అధికారుల సూచనలతో రైతుల ఖాతాల్లో వేశామన్నారు. మిగిలిన రూ.2.38 కోట్ల బకాయిలను మార్చి 5 వరకు చెల్లిస్తామని ఆయన వివరించారు. కర్మాగార యాజమాన్యంలో ఏర్పడిన అంతర్గత విబేధాల కారణంగా బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరిగిందని ఆయన గుర్తు చేశారు. ఇక మీదట రైతులకు చెరకు బిల్లుల పెండింగ్ అనే సమస్య ఉండబోదని ఆయన స్పష్టం చేశారు. ఈ నెల 28న కర్మాగారం వేలం వేసేందుకు అధికార యంత్రాంగం నిర్ణయించిన నేపథ్యంలో యాజమాన్యం స్పందించి జిల్లా అధికారుల సమక్షంలో రైతుల ఖాతాల్లో వేసినట్లు సమాచారం. ఈ మేరకు తమ ఖాతాల్లోకి చెరకు బిల్లులకు సంబంధించి నగదు చేరిందని పలువురు రైతులు వివరించారు.

ఇసుక అక్రమ రవాణాపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడులు

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 27: ఇసుక అక్రమ రవాణాపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. సిద్దిపేట పట్టణ శివారులోని నాగదేవత టెంపుల్ చౌరస్తా నుంచి సిద్దిపేటకు మంగళవారం ఉదయం నెంబరు ప్లేట్ లేకుండా రెండు ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారని నమ్మదగిన సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు, సిద్దిపేట వన్ టౌన్ పోలీసులు కలిసి దాడి చేసి పట్టుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, రేషన్ బియ్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలు విక్రయిస్తే 8712667447, 8712667446 నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని అధికారులు తెలిపారు.

ఎల్ఆర్ఎస్‌పై కాంగ్రెస్ మాట తప్పింది

- ఫీజు లేకుండా క్రమబద్ధీకరించాలి
- తాగునీటిలోనూ లాభం వెతుకుతారా?
- ఇలాంటి వ్యక్తి సీఎం కావడం దురదృష్టకరం
- ప్రభుత్వమంటే రియల్ వ్యాపారం కాదు: హరీశ్



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి రాగానే ఎల్ఆర్ఎస్‌ను రద్దు చేస్తామని, ఉచితంగా స్థలాలను క్రమబద్ధీకరిస్తాం అంటూ ప్రజలను రెచ్చగొట్టిన కాంగ్రెస్.. ఇపుడు మాట తప్పి ఫీజు వసూలు చేసేందుకు సిద్ధమైందని మాజీ మంత్రి టి.హరీశ్ రావు ఆరోపించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో మంగళవారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని, లేదంటే మోసపూరిత హామీ ఇచ్చినందుకు ప్రజలకు కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హామీల అమలుపై మాట మార్చడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని.. ఇది వారి మోసపూరిత విధానాలకు నిదర్శనమని విమర్శించారు. ఆ పార్టీ నేతలకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. గతంలో చేసిన ప్రకటనలకు అనుగుణంగా ఎల్ఆర్ఎస్‌ను ఎలాంటి ఫీజులు లేకుండా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు..ప్రజలకు అందించే స్వచ్ఛమైన తాగు నీటిలోనూ లాభం వెతుకుతారా..? మిషన్ భగీరథ పథకంలో లాభం వెతికే వ్యక్తి ముఖ్యమంత్రి కావడం మన దురదృష్టమని హరీశ్‌రావు పేర్కొన్నారు. భగీరథ ద్వారా ఏం లాభం తెచ్చారని.. దానికోసం తెచ్చిన అప్పుపై వడ్డీ ఎలా కడతారని ఆయన ప్రశ్నించడం అంతకన్నా దౌర్భాగ్యం, భావదారిద్ర్య ఆరోపణ మరొకటి ఉండద మంగళవారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.ప్రభుత్వమంటే రియల్ ఎస్టేట్ వ్యాపారం కాదు.. ప్రజా సంక్షేమంలో లాభనష్టాలు చూసుకోరని రేవంత్‌రెడ్డిపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. మిషన్ భగీరథ పథకాన్ని ప్రజల ఆరోగ్యం కాపాడిన గొప్ప సంజీవనిగా చూడాలని.. అందులో లాభనష్టాలు బేరీజు వేసుకోవడం ఒక ప్రభుత్వాధినేతకు తగదని హితవుపలికారు. ఆసరా పెన్షన్ల ద్వారా కూడా రూ.వేలకోట్లు ఖర్చవుతుంది. దాని వల్ల కూడా లాభం లేదంటారా..? అని ప్రశ్నించారు.

మీ ఎత్తు గురించి నేను మాట్లాడితే..!

'ఇటీవల పలు సందర్భాల్లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిసారి నా ఎత్తు గురించి వ్యాఖ్యానిస్తున్నారు. నేను కూడా మీ (సీఎం రేవంత్‌ను ఉద్దేశించి) ఎత్తు గురించి మాట్లాడితే సంస్కారవంతంగా ఉండదు. ఎవరి ఎత్తు ఎంత అనేది ప్రజలకు అవసరం లేదు. ప్రజల కోసం ఎవరు ఎంతమేరకు ఆలోచిస్తున్నారో.. ఎవరెంత పనిచేస్తున్నారో.. మాత్రమే వారికి అవసరం' అని హరీశ్‌రావు వెల్లడించారు.

కాంగ్రెస్ వస్తే ఎల్ఆర్ఎస్ రద్దు చేస్తామన్నారు కదా?: టీఆర్ఏ

ఇప్పుడు ప్రభుత్వంలో ఉన్న ముఖ్యమంత్రితోపాటు మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్ రద్దు చేస్తామని ప్రకటనలు చేశారని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ (టీఆర్ఏ) అధ్యక్షుడు నారగోని ప్రవీణ్ కుమార్ గుర్తు చేశారు. "గత ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ కింద రుసుము వసూలుకు ప్రతిపాదనలు చేస్తే.. లేఅవుట్ రెగ్యులేషన్ స్కీమ్ లాగే మ్యారేజ్ రెగ్యులేషన్ స్కీమ్ కూడా తీసుకొస్తారేమో అని గతంలో రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఇప్పుడేమో సీఎం హోదాలో అదే పథకాన్ని అమలు చేసేందుకు రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఎల్ఆర్ఎస్ రద్దు చేయాలని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేయగా గతంలో కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. ఇప్పుడు ఇదే ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ తెరమీదకు తెచ్చి మార్చి 31లోగా గడువు విధించి రెగ్యులరైజేషన్ చేయించుకోవాలని చెప్పడం సమంజసంగా లేదు" అని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

తెలంగాణలో 17 సీట్లూ బీజేపీ గెలవాలి

హైదరాబాద్ సీటును కూడా కైవసం చేసుకోవాలి.. అసదుద్దీన్ పార్లమెంటుకు వెళ్లకుండా అడ్డుకోవాలి

- విజయ సంకల్ప యాత్రలో కిషన్‌రెడ్డి



విజయ సంకల్ప యాత్రలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న దృశ్యం

హైదరాబాద్ సిటీ/కార్వాన్/నిజామాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాల్లోనూ బీజేపీ గెలవాలని, మజ్లిస్ సీటును కూడా కైవసం చేసుకుని అసదుద్దీన్ ఒవైసీ పార్లమెంటుకు వెళ్లకుండా అడ్డుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజాసామాన్యానికి, అభివృద్ధికి వ్యతిరేకంగా మజ్లిస్ పార్టీ పనిచేస్తుందని, మెట్రో రైలు ప్రాజెక్టును అడ్డుకుంటుందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే దాని పంచన చేరి పోలీసు వ్యవస్థను తన ఆధీనంలో పెట్టుకుంటుందని విమర్శించారు. మంగళవారం కిషన్ రెడ్డి హైదరాబాద్‌లో రెండో రోజు విజయ సంకల్ప యాత్ర నిర్వహించారు. గుడిమల్కాపూర్ జైన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్వాన్, గోషామహల్, చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో యాత్ర కొనసాగింది. జుమ్మేరాత్ బజార్‌లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. బీజేపీకి ముఖ్యంగా హైదరాబాద్ లోక్‌సభ సీటు గెలవాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పాలనలో 12 లక్షల కోట్ల అవినీతి జరిగిందని, మోదీ ఒక్క రూపాయి కూడా అవినీతి లేకుండా పాలన కొనసాగిస్తున్నారన్నారు. ప్రపంచంలో భారతదేశ ప్రతిష్ఠను పెంచారన్నారు. రాష్ట్రంలో 17 లోక్‌సభ, 114 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 5500 కిలోమీటర్ల మేర ఐదు విజయ సంకల్ప యాత్రలు కొనసాగుతాయని తెలిపారు. వచ్చే నెల 2వ తేదీతో ముగుస్తాయన్నారు. మోదీ మళ్లీ ప్రధాని కావాలని ఈ యాత్రలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కాగా, నిజామాబాద్ జిల్లా బాల్కొండ, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్ నియోజకవర్గాల్లో జరిగిన యాత్రలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పాల్గొన్నారు. కేంద్రంలో మూడోసారీ బీజేపీయే అధికారంలోకి వస్తుందని, మోదీ మళ్లీ ప్రధాని అవుతారని ఆమె ధీమా వ్యక్తం చేశారు. మోదీ రైతుల కోసం పసుపు బోర్డు ఏర్పాటు చేసి హామీ నెరవేర్చారన్నారు. కాంగ్రెస్ పార్టీ నామమాత్ర మెజారిటీతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. ఇప్పటికీ ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా కాంగ్రెస్‌కు ఆదరణ లేదని, కేంద్రంలో ఆ పార్టీ అధికారంలోకి రావడం కలేనని వ్యాఖ్యానించారు.

తల్లిని అడ్డుపెట్టుకొని రాజకీయాలు

పొన్నం తల్లిని నేను అవమానించలేదు.. యాత్రను ఆపేయాలనుకుంటే కాంగ్రెస్‌కే నష్టం

- హామీల అమలును ప్రశ్నిస్తే దాడులా?
- నేను ఓడిపోతే.. రాజకీయ సన్యాసం
- కాంగ్రెస్ ఓడితే పొన్నం తప్పుకుంటారా?
- కేటీఆర్‌తో బీఆర్ఎస్..

పొన్నంతో కాంగ్రెస్ నాశనం: సంజయ్



ప్రజాహిత యాత్ర బహిరంగ సభలో సంజయ్

హుస్నాబాద్, ఫిబ్రవరి 27: కన్న తల్లిని అడ్డుపెట్టుకొని మంత్రి పొన్నం ప్రభాకర్ రాజకీయం చేయాలనుకుంటున్నాడని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ విమర్శించారు. 'రాముడు అయోధ్యలోనే పుట్టాడా..?' అని అడిగిన వారిని ప్రశ్నించాను తప్ప.. పొన్నం తల్లిని ఉద్దేశించి అనలేదని వివరణ ఇచ్చారు. అందరు తల్లులు తన తల్లితో సమానమని.. ప్రభాకర్ తల్లిని తాను అవమానించలేదని స్పష్టం చేశారు. తాను అంత సంస్కార హీనుడిని కానని అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ అంబేడ్కర్ చౌరస్తాలో జరిగిన ప్రజాహిత యాత్ర బహిరంగ సభలో సంజయ్ మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చేలోగా కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోతే.. అడుగడుగునా నిలదీస్తానే ఉంటామని హెచ్చరించారు. హామీల అమలుకు ఇంకా 20 రోజులే గడువు ఉందన్నారు. రేషన్ కార్డులు ఉన్న వారికే పథకాలు ఇస్తామని చెబుతున్నారని.. రేషన్ కార్డులు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. తాను హామీల అమలును ప్రశ్నిస్తే.. కాంగ్రెస్ దాడులు చేయించడం ఏంటని ప్రశ్నించారు. పొన్నం ప్రభాకర్ ఏమీ చేయలేదు కాబట్టే గత ఎంపీ ఎన్నికల్లో మూడో స్థానం వచ్చిందని తెలిపారు. అయోధ్య అక్షింతలను రేషన్ బియ్యం అని ఆయన అన్నది వాస్తవం కాదా..? అని ప్రశ్నించారు. ప్రజాహిత యాత్రను ఆపాలనుకుంటే కాంగ్రెస్‌కే నష్టమని హెచ్చరించారు. కేసీఆర్ పదేళ్లలో రూ.5 లక్షల కోట్ల అప్పు చేస్తే, కాంగ్రెస్ 2 నెలల్లో రూ.10వేల కోట్ల అప్పు చేసిందని విమర్శించారు. తల్లిని అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తున్నందుకు స్వర్గంలో ఉన్న పొన్నం తల్లి ఆత్మ ఎంత క్షోభిస్తుందోనని సంజయ్ అన్నారు. అయితే, పక్కనే ఉన్న నాయకులు పొన్నం తల్లి బతికే ఉందని.. తండ్రి చనిపోయాడని తెలిపారు. దీంతో పొరపాటును గుర్తించిన సంజయ్.. పొన్నం తండ్రి ఆత్మ ఎంత క్షోభిస్తుందోనని అన్నారు. ఆయన తల్లి నూరేళ్లు ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. 'రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రికి సవాల్ విసురుతున్నా.. నేను నా విశ్వాసాలతో రాముడి పేరిట ఎంపీ ఎన్నికల్లో నిలుచుంటా. నువ్వు నీ వాదనతో అభ్యర్థిని నిలబెట్టు. నేను ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటా. మళ్లీ రాముడని, హిందూ మతమని మాట్లాడను. మీ అభ్యర్థి ఓడితే రాజకీయాల నుంచి తప్పుకుంటావా..?' అని బండి సంజయ్ పేర్కొన్నారు. కేటీఆర్‌తో బీఆర్ఎస్ నాశనమైందని, పొన్నం లాంటి వారితో కాంగ్రెస్ నాశనమవుతుందని పేర్కొన్నారు. 'కేంద్ర ప్రభుత్వం ఉచితంగా రేషన్ బియ్యం ఇస్తుంటే మీ ఫొటోలు పెట్టుకుంటారా.. తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వమే ఉచితంగా బియ్యం ఇస్తోందని, ఇక్కడికి బియ్యం పంపవద్దని ప్రధాని మోదీకి లేఖ రాస్తా' అని అన్నారు.

సంజయ్ క్షమాపణ చెప్పాలి

కాంగ్రెస్ శ్రేణుల డిమాండ్

పాదయాత్ర శిబిరాన్ని ముట్టడించే యత్నం

చిగురుమామిడి/హుస్నాబాద్ రూరల్: సంజయ్ చేపట్టిన ప్రజాహిత యాత్ర మంగళవారం ఉద్రిక్త వాతావరణంలో సాగింది. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సంజయ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని హుస్నాబాద్ కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. సంజయ్ ప్రజాహిత యాత్రను అడ్డుకునే ప్రయత్నం చేశారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లిలో సోమవారం రాత్రి సంజయ్ బస చేశారు. మంగళవారం ఉదయం అక్కడికి తరలి వచ్చిన కాంగ్రెస్ నాయకులు సంజయ్ బస చేసిన శిబిరాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించారు. అక్కడ ఉన్న బీజేపీ నాయకులు వారిని ప్రతిఘటించారు. పోలీసులు ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. దీంతో ఉల్లంపల్లి శివారులోని ప్రధాన రహదారిపై కాంగ్రెస్ కార్యకర్తలు బైఠాయించారు. కాంగ్రెస్ శ్రేణులను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం కరీంనగర్ జిల్లా సరిహద్దు నుంచి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని రాములపల్లి వరకు పాదయాత్రను పోలీస్ బందో బస్తుతో తీసుకెళ్లారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేయడంపై కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు మంగళవారం నిరసన తెలిపారు. కరీంనగర్‌లో రాస్తారోకో చేశారు. పలుచోట్ల సంజయ్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఎంపీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాహిత యాత్ర మంగళవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలానికి వస్తున్న క్రమంలో సంజయ్‌కి స్వాగతం పలుకుతూ బీజేపీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై కాంగ్రెస్ కార్యకర్తలు అనుచిత రాతలు రాశారు. దీనిపై బీజేపీ నేతలు ముల్కనూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యాత్ర పేరిట 'బండి' రాజకీయ డ్రామాలు

- నా తల్లిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు
- ఎంపీగా అయిదేళ్లలో ఏం చేశారో చెప్పాలి
- సంజయ్ ఒళ్లు దగ్గరపెట్టుకుని మాట్లాడు : మంత్రి పొన్నం



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి)/హుస్నాబాద్: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ రాజకీయ డ్రామాలతో ప్రజాహిత యాత్ర చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఆయన గాంధీ భవన్‌లో, సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. తన తల్లిపై బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై మండిపడ్డారు. ఎంపీగా ఐదేళ్ల పదవీ కాలంలో సంజయ్ కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నిస్తే.. ఆయన తన తల్లి జన్మకు సంబంధించి వ్యాఖ్యలు చేశారని, ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేవలం ప్రచారం కోసమే సంజయ్ తన యాత్రను కాంగ్రెస్ అడ్డుకున్నట్లు డ్రామాలకు తెరలేపారన్నారు. తాము వాళ్ల యాత్రలు అడ్డుకోవడం లేదని, ప్రజాస్వామ్యంలో యాత్ర చేసే హక్కు అందరికీ ఉంటుందని, కానీ అవివేకమైన మాటలు సరికాదని విమర్శించారు. తనకు శ్రీరాముడు అంటే గౌరవం అని, ఏనాడు శ్రీరాముడి గురించి కాని, అక్షింతల గురించి గాని మాట్లాడలేదని, ఒకవేళ మాట్లాడినట్లు నిరూపిస్తే సజీవ సమాధికి సిద్ధమని సవాల్ విసిరారు. తన మాటలను వక్రీకరించి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. శ్రీరాముని పేరు మీద ఓట్లు అడగడం కాదు.. అయిదేళ్ల కాలంలో కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ నియోజకవర్గ ప్రజలకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. సంజయ్ వ్యాఖ్యలపై బీజేపీ కేంద్ర, రాష్ట్ర నాయకత్వాలు ఆలోచించాలన్నారు. ఇలాంటి నాయకుని డ్రామాలను సమర్థిస్తున్నారా..? అని ప్రశ్నించారు. సంజయ్ ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని మంత్రి హెచ్చరించారు.

చక్రియాల్‌ను సందర్శించిన జపాన్ బృందం

- వ్యవసాయ రంగంపై అధ్యయనం



చక్రియాల్‌లో పర్యటిస్తున్న జపాన్ బృందం

పుల్‌కల్, ఫిబ్రవరి 27: చౌటకూర్ మండలం చక్రియాల గ్రామాన్ని ఐఐటీ కంది వారి సౌజన్యంతో జపాన్ బృందం మంగళవారం సందర్శించింది. గ్రామంలో వ్యవసాయం ఏ విధంగా చేస్తున్నారు, సేద్యంలో తలెత్తుతున్న ఇబ్బందులు, పంటల దిగుబడులు, మార్కెటింగ్ తదితర అంశాల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పర్యటించి సేద్యానికి వినియోగిస్తున్న పరికరాలను పరిశీలించి వాటి పనితీరును తెలుసుకున్నారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో రైతులతో సమావేశమయ్యారు. గ్రామాన్ని సందర్శించిన వారిలో సుజూకీ కంపెనీకి చెందిన రమ, వుకీ, కియా మాథ్యూ, లియోక్త, అకిర, కిరోకి, సతోరాలు ఉన్నారు. వీరి వెంట మండల వ్యవసాయ అధికారి చైతన్య, ఏఈవో మనిషా, రైతులు గాజుల సుభాష్‌బాబు, రోళ్లపాటి మల్లేశం, మన్నె నర్సింహులు, తుంగె మల్లేశం ఉన్నారు.

ఆర్టీసీ బస్సులో బంగారు ఆభరణాలు..

తూప్రాన్, ఫిబ్రవరి 27: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళకు చెందిన బ్యాగులో ఉన్న బంగారు అభరణాలు చోరీ అయిన సంఘటన తూప్రాన్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ ఈఎస్‌ఐ ప్రాంతంలో నివాసముండే తూప్రాన్‌కు చెందిన ఉప్పల శ్వేత తూప్రాన్‌లో జరిగిన శుభకార్యానికి సోమవారంరాత్రి హాజరైంది. మంగళవారం మధ్యాహ్నం తిరిగి హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్సులో బయలుదేరింది. తూప్రాన్ టోల్‌ప్లాజా వద్దకు వెళ్లిన తర్వాత బ్యాగును తెరిచిచూడగా అందులో ఉన్న 12.5 తులాల బంగారు అభరణాలు కనిపించలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివానందం వివరించారు.

గోమారంలో 11తులాల బంగారు ఆభరణాల చోరీ

శివ్వంపేట: మండల పరిధిలోని గోమారం గ్రామంలో ఇంటి తాళాలు పగులగొట్టి బంగారు అభరణాలు, నగదు అపహరించుకపోయిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోమారం గ్రామానికి చెందిన గంగిరెడ్డి మల్లారెడ్డి కుటుంబీకులు మంగళవారం ఇంటికి తాళం వేసి పొలం పనులకు వెళ్లారు. సాయంత్రం వచ్చే సరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లో చూడగా బీరువాలో ఉన్న 11తులాల బంగారు ఆభరణాలు, రూ.50వేల నగదు కనిపించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి..

శివ్వంపేట, ఫిబ్రవరి 27: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతిచెందిన సంఘటన శివ్వంపేట మండలం చండి గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన బంగారుగాని కుమార్(35) మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవపడేవాడు. ఈ క్రమంలోనే మంగళవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ సంఘటనపై ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డిని వివరణకోరగా ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

గాయపడిన పెయింటర్ చికిత్స పొందుతూ మృతి

తూప్రాన్, ఫిబ్రవరి 27: మెట్లు దిగుతూ కిందపడిన పెయింటర్ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ అడ్డగుట్టకు చెందిన పెయింటర్ పెద్దింటి వినోద్(40) వారంరోజుల క్రితం తూప్రాన్‌కు వెళ్లి, తూప్రాన్‌కు చెందిన పెయింటర్ జాంగీర్ వద్ద పనులు చేస్తున్నాడు. 23న సాయంత్రం మెట్ల మీద నుంచి దిగుతుండగా కిందపడి గాయపడ్డాడు. చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా అక్కడి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ శివానందం తెలిపారు.

పార్లమెంట్ ఎన్నికల్లో అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- మెదక్ కలెక్టర్ రాజర్షిషా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 27: పార్లమెంట్ ఎన్నికల్లో అధికారులు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు మెదక్ కలెక్టర్ రాజర్షిషా సూచించారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, వీవీటీ, అకౌంటింగ్ టీం, నోడల్ ఆఫీసర్ల శిక్షణలో కలెక్టర్ మాట్లాడారు. గత ఎన్నికల్లో అనుభవాలను పరిగణలోకి తీసుకొని రానున్న లోక్‌సభ ఎన్నికలను నోడల్ ఆఫీసర్లకు కేటాయించిన విధులను విజయవంతంగా నిర్వహించాలన్నారు. సెక్టోరల్ ఆఫీసర్లకు ట్రైనింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఈవీఎం, కమీషనింగ్, పోస్టల్ బ్యాలెట్ నిర్వహణ, పోస్టల్ హోం ఓటింగ్, ఈవీఎం మేనేజ్‌మెంట్ ర్యాండమైజేషన్ పోలింగ్ పర్సన్స్ డేటా ఎంట్రీ సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. నామినేషన్ డేటా ఎంట్రీ, 7 అసెంబ్లీ సెగ్మెంట్లు నుంచి డైలీ వారి రిపోర్టులు, ఓటర్ హెల్ప్‌లైన్ తదితర అంశాలపై సుదీర్ఘంగా వివరించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో నోడల్ అధికారుల పాత్ర కీలకమన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అదనపు ఎస్పీ మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

యువత నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి: కలెక్టర్

పార్లమెంటరీ సంస్థల పనితీరును యువత అర్థం చేసుకునేందుకు యువజన వ్యవహారాల, క్రీడల మంత్రిత్వశాఖ ఎన్‌వైకేఎస్ దేశంలోని అన్ని రాష్ట్రాల్లో జిల్లాస్థాయి యూత్ పార్లమెంట్ నిర్వహిస్తున్నదని కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓగార్డెన్‌లో జరిగిన జిల్లాస్థాయి నైబర్‌హుడ్ యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. యువతలో నాయకత్వ లక్షణాలు పెంపొందించడం ద్వారా వారు పూర్తి సామర్థ్యాన్ని గ్రహించి దేశ నిర్మాణానికి సహకరించేందుకు ఈ వేదికలు ఉపయోగపడుతాయన్నారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించాలి

డిజిటల్ లావాదేవీలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. ఆర్థిక అక్షరాస్య వారోత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని నిర్వహించిన 2కే పాదయాత్రను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ప్రజలందరూ బ్యాంకు సేవలను వినియోగించుకొని, సైబర్ నేరాలు, డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా అధికారులకు కలెక్టర్ సూచించారు.

నీటి యాజమాన్య ప్రాధాన్యంపై అవగాహన కల్పించాలి

- జిల్లా వ్యవసాయ శాఖాధికారి నర్సింహారావు



సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని రైతువేదిక వద్ద శిక్షణ పొందిన ఏఈవోలతో జిల్లా వ్యవసాయాధికారులు

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 27: రైతులకు నీటి యాజమాన్య ప్రాధాన్యంపై ఏఈవోలు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి నర్సింహారావు సూచించారు. సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన శిక్షణ ముగింపు సందర్భంగా మాట్లాడారు. ప్రస్తుతం వాతావరణ మార్పుల్లో పంట సాగుపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఎలాంటి పంటలు సాగుచేస్తే అధిక దిగుబడి వస్తుందనే విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఏఈవోలకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. నాగేందర్, ఈఈ నాగేశ్వర్‌రెడ్డి, వ్యవసాయ సంచాలకులు సునీత, మనోహర, ఏవో ఏబీజీకే ప్రసాద్, ఏఈవోలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఫిన్లాండ్ దేశస్థులు



చిన్నారులకు అందిస్తున్న సేవల గురించి తల్లులను అడిగి తెలుసుకుంటున్న ఫిన్లాండ్ దేశ హెల్సింకి యూనివర్సిటీ బృందం సభ్యులు

కొండాపూర్, ఫిబ్రవరి 27: కొండాపూర్ మండల పరిధిలోని చెర్లగోపులారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఫిన్లాండ్ దేశస్థులు మంగళవారం సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రాలు ఎలా పనిచేస్తున్నాయి.. చిన్న పిల్లల్లో మైండ్ ఇంప్రూవ్‌మెంట్ ఎలా ఉన్నదని ఫిన్లాండ్ దేశ హెల్సింకి యూనివర్సిటీ బృందం సభ్యులు ఆరాతీశారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నేర్పుతున్న పాఠాలు, ఆటలు, పౌష్టికాహారం, సమయ పాలన తదితర విషయాల గురించి అంగన్‌వాడీ టీచర్ అనసూయను అడిగి తెలుసుకున్నారు.

మానసిక ఒత్తిడితో సాఫ్ట్‌వేర్ సంస్థ సీఈవో బలవన్మరణం



కాశీవిశ్వనాథ్ మృతదేహం

పటాన్‌చెరు, ఫిబ్రవరి 27: సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పోలీసుస్టేషన్ పరిధిలో మానసిక ఒత్తిడితో సాఫ్ట్‌వేర్ సంస్థ సీఈవో మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అమీన్‌పూర్ పోలీసుస్టేషన్ పరిధిలోని దుర్గాహోమ్స్ ఫేజ్2లో నివాసం ఉండే సాఫ్ట్‌వేర్ సంస్థ సీఈవో కిల్లాటి కాశీవిశ్వనాథ్(38) మంగళవారం తెల్లవారుజామున తన ఇంట్లోని మొదటి అంతస్తులో కిటికీకి చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య వినీల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా కాశీవిశ్వనాథ్ మాదాపూర్‌లోని ఎక్లాట్ ప్రైమ్ అనే సొంత సాఫ్ట్‌వేర్ కంపెనీని స్థాపించి సీఈవోగా వ్యవహరిస్తున్నారు. ఆరు నెలల క్రితం అమెరికా వెళ్లి అక్కడ సైతం మరో సాఫ్ట్‌వేర్ కంపెనీని స్థాపించారు. సంస్థలు సరిగా నడవకపోవడంతో ఇటీవల హైదరాబాద్ తిరిగి వచ్చారు. వ్యాపారంలో ఒత్తిడి ఎక్కువ కావడంతో మానసికంగా కృంగిపోయారు. ఈ క్రమంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని అమీన్‌పూర్ ఎస్‌ఐ రమణ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



వెంకటేష్‌గౌడ్(ఫైల్)

మనోహరాబాద్, ఫిబ్రవరి 27: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం కోనాయిపల్లి పిటి గ్రామానికి చెందిన వెంకటేష్‌గౌడ్(48) భార్యతో కలిసి కొంతకాలంగా దండుపల్లి గ్రామంలో అద్దెకు ఉంటున్నారు. ఇంటి పక్కనే ఉన్న ఐటీఎల్ పరిశ్రమలో వెంకటేష్‌గౌడ్ 25 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నాడు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో మనోవేదనకు గురై సోమవారం రాత్రి తాను పనిచేసే పరిశ్రమ వెనకాల పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం ఉదయం చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు, కుటుంబసభ్యులకు సమాచారమందించారు. భార్య పద్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

జాతీయ కరాటే పోటీల్లో సత్తాచాటిన విద్యార్థినులు



జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్‌లో సత్తాచాటిన విద్యార్థినులతో ప్రధానోపాధ్యాయుడు, ప్రజాప్రతినిధులు

కంగ్టి, ఫిబ్రవరి 27: నర్సాపూర్‌లో అండర్-14 విభాగంలో నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో సంగారెడ్డి జిల్లా కంగ్టి మండల పరిధిలోని దెగుల్‌వాడి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు చెంది విద్యార్థినులు బంగారు, వెండి, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. జిల్లా, రాష్ట్ర సరిహద్దుల్లో గల దెగుల్‌వాడికి చెందిన అపూర్వరెడ్డి బంగారు పతకం సాధించగా, సానియా వెండి, అక్షిత, భాగ్యశ్రీలు కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థినిలను ప్రధానోపాధ్యాయులు శంశోద్దీన్, మాజీ ఎంపీటీసీ సుశీల గోవింద్‌రెడ్డి, ఉపాధ్యాయులు తిరుపతిరెడ్డి, నందిని, ఎంపీపీ సంగీత, జడ్పీటీసీ లలిత అభినందించారు.

బండి సంజయ్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలి

కాంగ్రెస్ పార్టీ మంత్రులు, నాయకులపై వ్యాఖ్యలు చేసే ముందు బండి సంజయ్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని, లేకుంటే తీవ్రస్థాయిలో ఆయనకు గుణపాఠం చెప్తామని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ తల్లిని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన బండి సంజయ్ ఆ వాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఆయన చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం పలుచోట్ల ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.



సిద్ది పేట పట్టణంలోని బండి సంజయ్ చిత్రపటాన్ని దహనం చేస్తున్న నాయకులు

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి27: కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్‌లు ఆధ్వర్యంలో మంగళవారం సిద్దిపేట పట్టణంలోని ముస్తాబాద్ చౌరస్తా వద్ద బండి సంజయ్ ఫ్లెక్సీని దహనం చేశారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు బొమ్మల యాదగిరి, జిల్లా మహిళా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, నాయకులు దాసరి రాజు, నాయిని నరసింహారెడ్డి, గోపికృష్ణ, అడ్వకేట్ రేణుక, వనజ, కలిమొద్దీన్, గయాజుద్దీన్, వాహబ్, అజ్మత్, రాశద్, మజార్ మాలిక్, హబీబ్, ఫయాజ్, సలీం, రాకేష్, రాకేశ్ యాదవ్, రఘు, నజ్జు, సాయి ప్రతాప్ పాల్గొన్నారు.



హుస్నాబాద్‌లో ఎంపీ బండి సంజయ్ దిష్టిబొమ్మకు ఉరి వేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

● **హుస్నాబాద్:** రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై వ్యక్తిగత దూషణలకు పాల్పడ్డాడని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ దిష్టిబొమ్మను హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉరి తీశారు. పొన్నం తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై బండి సంజయ్‌కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్కు శ్రీనివాస్, నర్సాగౌడ్, ఘైదం శెట్టి రవీందర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం బండి సంజయ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య కౌన్సిలర్ చిత్తారి పద్మ తదితరులు ఉన్నారు.



కోహెడలో బండి సంజయ్ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న నాయకులు

● **కోహెడ:** మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ దిష్టిబొమ్మను మంగళవారం దహనం చేశారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బీమ్‌రెడ్డి తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ జగన్‌రెడ్డి, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు దూలం శ్రీనివాస్‌గౌడ్, ముంజ తిరుపతి, జయరాజ్, రజ మల్లారెడ్డి, చుక్క అశోక్, శంకర్, బైరీ సుధాకర్, ముంజ శ్రీనివాస్, పిడిషెట్టి సాయి, దినేష్, పద్మారెడ్డి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



నంగునూరులో బండి సంజయ్ చిత్రపటాన్ని దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

● **అక్కన్నపేట:** అక్కన్నపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చింతల మల్లారెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో పీరెల్లి లింగమూర్తి, నునవత్ మోహన్‌నాయక్, కాశబోయిన ఎల్లయ్య, ఎండీ అక్బర్‌పాష, దాసరి కృష్ణ, అనిల్, తదితరులు ఉన్నారు. అలాగే రామవరం గ్రామంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇందులో మాజీ ఎంపీటీసీ లింగాల కనకయ్య ఉన్నారు

● **నంగునూరు:** నంగునూరులో మంగళవారం టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి ఆధ్వర్యంలో ఎంపీ బండి సంజయ్ ఫ్లెక్సీని మండల కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండలం అధ్యక్షుడు తప్పేట శంకర్, అచ్చిన సత్తయ్య, రమేష్, గోనెపల్లి శివప్రసాద్, చెలికాని యాదగిరి, అనరాజు నాగరాజు, బాగు శ్రీకాంత్, రాగుల కృష్ణ, జంగిటి శ్రీనివాస్, దాసరి కిషన్, రాగుల కనకయ్య అనరాజు రాజు, దేవులపల్లి శంకర్,లు పాల్గొన్నారు.

గాయపడిన పారిశుధ్య కార్మికుడు మృతి



శ్రీరాముల గణేశ్ (ఫైల్)

చేర్యాల, ఫిబ్రవరి 27: ఇటీవల ట్రాక్టర్ పైనుంచి కిందపడిన ఘటనల గాయపడి చికిత్స పొందుతున్న కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామానికి చెందిన సఫాయి కార్మికుడు శ్రీరాముల గణేశ్ (42) మంగళవారం మృతి చెందాడు. ఇటీవల చెత్తను డంపింగ్‌యార్డుకు తరలిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడి గాయాలపాలయ్యాడు. ఆస్పత్రిలో చికిత్సపొందుతుండగా, మంగళవారం ఆరోగ్యం క్షీణించడంతో మృతి చెందాడు.

మట్టి తరలింపును అడ్డుకున్న రెవెన్యూ సిబ్బంది

మద్దూరు, ఫిబ్రవరి 27 : మండలంలోని లద్నూరు గ్రామంలో కొందరు అనుమతులు లేకుండా చెరువు శిఖం నుంచి మట్టిని తరలిస్తుండగా మంగళవారం రెవెన్యూ సిబ్బంది అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కొందరు ఇటుకబట్టీల వ్యాపారం నిర్వహిస్తూ ఎలాంటి అనుమతులు లేకుండా చెరువు శిఖం నుంచి ఎక్స్‌కవేటర్‌తో ట్రాక్టర్లలో మట్టి తరలిస్తున్నారు. గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో అప్రమత్తమైన రెవెన్యూ సిబ్బంది మంగళవారం మట్టి తరలింపును అడ్డుకుని నిలిపివేశారు. కాగా గ్రామపంచాయతీ, రెవెన్యూ అధికారుల అండదండలతోనే మట్టి వ్యాపారం యథేచ్ఛగాగా కొనసాగుతున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై తహసీల్దారు, గ్రామ స్పెషలాఫీసర్ అనంతరెడ్డిని వివరణ కోరగా ఇది మా పరిధిలోకి రాదని, అయితే మట్టి తరలింపును నిలిపివేసి ఇరిగేషన్ ఏఈకి సమాచారం అందించి చర్యలు తీసుకోవాలని కోరినట్టు తెలిపారు.

ఇంటర్ పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు: సీపీ



సీపీ అనూరాధ

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 27: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో జిల్లాలోని 44 ఇంటర్ పరీక్షా కేంద్రాల వద్ద బుధవారం నుంచి 144సెక్షన్ అమలులో ఉంటుందని సీపీ డాక్టర్ బి.అనూరాధ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 19వ తేదీ వరకు ఉదయం 6నుంచి సాయంత్రం 6 వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. పరీక్షలు జరిగే సమయంలో సమీపంలో ఉన్న అన్ని జిరాక్స్ సెంటర్లు మూసి వేయాలని సూచించారు. పోలీసు అధికారులు, సిబ్బంది పరీక్షా సమయంలో పెట్రోలింగ్ నిర్వహించనున్నట్టు తెలిపారు. పోలీస్ స్టేషన్ నుంచి పరీక్షా కేంద్రానికి ప్రశ్నాపత్రాలను తీసుకువెళ్లే సమయంలో తప్పనిసరిగా కానిస్టేబుల్ ఎస్కార్ట్ వుండాలని ఆదేశించారు. విద్యార్థులు పరీక్షా సమయానికి గంట ముందే కేంద్రానికి చేరుకోవాలని, సీపీ సూచించారు.

కాంగ్రెస్ వింత రాజకీయాలు చేస్నున్నది

● **బీజేపీ నాయకులు**

కోహెడ, ఫిబ్రవరి 27: ఎంపీ బండి సంజయ్ అనని మాటను అన్నట్టుగా చిత్రీకరిస్తూ, కాంగ్రెస్ నాయకులు వింత రాజకీయాలు చేస్తున్నారని బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం కోహెడలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తప్పుడు ప్రచారం సాగిస్తూ, యాత్రకు అడ్డంకులు సృష్టిస్తూ, దిష్టిబొమ్మలను దహనం చేయిస్తూ రాజకీయాలు చేయడం మంచి కాదన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం, మాజీ సర్పంచ్ మ్యాకాల చంద్రశేఖర్‌రెడ్డి, బీజేపీ నాయకులు పిల్లి నర్సయ్య గౌడ్, గుగ్గిళ్ల శ్రీనివాస్, మామిడి కరుణాకర్‌గౌడ్, కంది సత్యనారాయణరెడ్డి, తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

యాత్రను అడ్డుకోవడం అప్రజాస్వామికం

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 27: ఎంపీ బండి సంజయ్ ప్రజాహిత యాత్రను అడ్డుకుని, బీజేపీ నాయకులపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం అప్రజాస్వామికమని బీజేపీ ఓబీసీ విభాగం ఉపాధ్యక్షుడు గర్నెపల్లి కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం ఆయన జగదేవ్‌పూర్‌లో మాట్లాడుతూ.. పదేళ్ళ పాలనలో ప్రధాన మంత్రి మోదీ చేపట్టిన పలు సంక్షేమ పథకాలు అభివృద్ధి పనులపై జిల్లాలోని హుస్నాబాద్ నియోజకవర్గంలో బీజేపీ ఎంపీ బండి సంజయ్ ప్రజాహిత యాత్ర చేపడుతున్నారని తెలిపారు.

గ్యారెంటీలు అమలు చేసేందుకు కాంగ్రెస్ సిద్ధం

● **డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి**

ములుగు, ఫిబ్రవరి 27: రాష్ట్ర ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ములుగు మండలం బండతిమ్మాపూర్ మాజీ సర్పంచ్ రాజపేట యాదమ్మకృష్ణగౌడ్‌తో పాటు నాయకులు ఆయన సమక్షంలో కాంగ్రెస్ చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నార న్నారు. ఈ రోజు చేవెళ్ల సభలో 500కు గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్ పథకాలను ప్రారంభించడం జరిగిందన్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పార్టీలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బండతిమ్మాపూర్‌లో డీసీసీ నర్సారెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న నాయకులు

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

కొండపాక, ఫిబ్రవరి 27 : కొండపాక మండలం దుద్దెడ, మర్పడగ గ్రామాల నుంచి వివిధ పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు మంగళవారం కొండపాక మండల అధ్యక్షుడు వాసరి లింగారావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుదర్శన్ , దుద్దెడ గ్రామ అధ్యక్షులు అఖిల్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. దుద్దెడ, మర్పడగ గ్రామాలకు చెందిన ఆరేపల్లి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీటీసీలు యాదగిరి, ఎల్లా గౌడ్,కొంక ప్రభాకర్,దోమల కనకయ్య ,బూర్గుల నాగరాజు,ఆరేపల్లి ప్రశాంత్, యాదగిరి , చరణ్ , మహేష్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లి ప్రజలను చైతన్యపరచాలని సూచించారు.

పార్టీ బలోపేతానికి కృషిచేయాలి



బీజేపీ విజయ సంకల్పయాత్రలో మాట్లాడుతున్న రాణి రుద్రమదేవి

దుబ్బాక/మిరుదొడ్డి, ఫిబ్రవరి 27: ప్రధాని మోదీ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లాగా పనిచేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమదేవి సూచించారు. మంగళవారం బీజేపీ రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజయ సంకల్ప యాత్ర దుబ్బాక మండలంలోని తిమ్మాపూర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా గ్రామం నుంచి అక్బర్‌పేట-భూంపల్లి మండలం పోతారెడ్డిపేట గ్రామం వరకు కార్యకర్తలతో బైక్‌ర్యాలీని నిర్వహించారు.రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపుకోసం కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలేష్‌గౌడ్, నాయకులు భిక్షపతి, కృష్ణ, శివకుమార్, వెంకట్‌గౌడ్, విభూషణ్‌రెడ్డి, ప్రవీణ్, బద్రి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

'మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి'

చిన్నకోడూరు, ఫిబ్రవరి 27 : విద్యార్థులు కష్టపడి చదివి పరీక్షలలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజశ్రీ సూచించారు. మండలంలోని రామునిపట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు మంగళవారం అక్షర సేద్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు చంద్రశేఖరశర్మ, లస్మయ్య, వనజ, ఉమారాణి, బాలకృష్ణారెడ్డి, రాజయ్య తిరుపతి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ట్రాలీ చోరీ

కొండపాక, ఫిబ్రవరి 27 : ట్రాక్టర్ ట్రాలీని చోరి చేసిన సంఘటన కొండపాక మండలం దమ్మకపల్లిసోమవారం రాత్రి చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన రైతు మంచాల నరేష్ గౌడ్ తన ట్రాక్టర్ ట్రాలీని వ్యవసాయ బావి వద్ద ఉంచి వెళ్ళాడు. తెల్లారి చూసేసరికి ట్రాలీ కనబడకుండా పోయింది.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

కొండపాక, ఫిబ్రవరి 27 : కొండపాక ప్రభుత్వ ఇంటర్ కళాశాలకు చెందిన 31 మంది బాలికలు మలబార్ గోల్డ్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. హన్మకొండలోని పింగిలి మహిళా డిగ్రీ కళాశాల మంగళవారం జరిగిన కార్యక్రమంలో రెండు లక్షల అరవై ఎనిమిది వేల రూపాయల స్కాలర్‌షిప్‌ను వారు అందుకున్నారు.

కోహెడ వాసికి డాక్టరేట్

కోహెడ, ఫిబ్రవరి 27: కోహెడ మండల కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త వేల్పుల శంకర్ పీహెచ్‌డి పూర్తి చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం, ఓరియంటల్ విభాగం తెలుగుశాఖ ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేసింది.

మునిసిపల్ చైర్‌పర్సన్‌కు మాతృవియోగం

చేర్యాల, ఫిబ్రవరి 27: చేర్యాల మునిసిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి మాతృవియోగం పొందారు. సిద్దిపేట మడలం బక్రిచెప్యాల గ్రామానికి చెందిన పీర్లపల్లి లక్ష్మి (92) అనారోగ్యంతో మంగళవారం కన్నుమూశారు. ఈమేరకు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు ఇతర నాయకులు ఆమెను ఫోన్‌లో పరామర్శించారు.

పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

● **జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి**



అల్లీపూర్ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

చిన్నకోడూరు, ఫిబ్రవరి 27: పదోతరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను మంగళవారం ఆయన సందర్శించి, పదో తరగతి విద్యార్థులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడాతూ.. 10 జీపీఏ సాధించే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. చదువులో వెనకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తపాలా శాఖ ద్వారా సోలార్ సర్వే

సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 27: కేంద్రప్రభుత్వం ప్రధాన మంత్రి సూర్యఘర్ ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రవేశపెట్టిందని, ఆ పథకాన్ని ప్రజలకు అందించేందుకు తపాల శాఖ సర్వే నిర్వహించ తలపెట్టిందని సిద్దిపేట పోస్టల్ సబ్ డివిజన్ సహాయ సంచాలకుడు జోయల్, హెడ్ పోస్టమాస్టర్ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. లబ్ధిదారులను ఎంపిక చేయాల్సిన బాధ్యతను తపాలశాఖకు అప్పగించడం సంతోషకరమన్నారు. సిద్దిపేట పోస్టల్ సబ్ డివిజన్ పరిధిలో 95 మంది పోస్టల్ ఉద్యోగులు ఈ సర్వేలో పాల్గొంటున్నట్లు తెలిపారు. అవసరమైన సమాచారాన్ని ఇచ్చి సహకరించాలని కోరారు. ఆసక్తి కలిగిన లబ్ధిదారుల నుంచి విద్యుత్ మీటర్ నెంబర్, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్‌ని సేకరించి ఉద్యోగులు యాప్‌లో నమోదు చేస్తారన్నారు.

మహిళ సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



చేవెళ్లకు వెళ్తున్న మహిళా సంఘాల సభ్యులు

మిరుదొడ్డి, ఫిబ్రవరి27: మహిళ సంఘాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నదని మిరుదొడ్డి ఏపీఎం కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మిరుదొడ్డి మహిళ సంఘాల సభ్యులు చేవెళ్లలో సీఎం రేవంత్‌రెడ్డితో జరిగే ముఖాముఖి కార్యక్రమానికి వెళ్లారు. కార్యక్రమంలో మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను జయప్రదం చేయాలి

● **గజ్వేల్ ఇన్‌చార్జి ఎంపీడీవో జయపాల్‌రెడ్డి**

గజ్వేల్, ఫిబ్రవరి 27: పోలియో నివారణకు మార్చి 3వ తేదీ నుంచి పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో జయపాల్‌రెడ్డి, సీడీపీవో వెంకట్రాజమ్మలు తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో పల్స్‌పోలియో టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలం, పట్టణ పరిధిలోని ప్రతి చిన్నారికి పోలియో చుక్కలను అందించాలన్నారు. సమావేశంలో మండల వైద్యాధికారులు రాహుల్‌కుమార్, బల్బీర్ సింగ్, సీహెచ్‌వో ఖాసీం, హెచ్‌ఈవో సత్యనారాయణరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

● **గజ్వేల్‌టౌన్:** పల్స్‌పోలీయో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారులు డాక్టర్ రాహుల్‌కుమార్, డాక్టర్ బల్బీర్‌సింగ్ సూచించారు. మంగళవారం గజ్వేల్‌లో పల్స్‌పోలియో కార్యక్రమంపై ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జైపాల్‌రెడ్డి, డాక్టర్ ప్రణయ్‌రాజ్, బస్తీ దవాఖాన డాక్టర్లు గౌతమి, ఐశ్వర్య, సీడీపీవో వెంకట్‌రాజమ్మ, సీహెచ్‌వో కాశీ, హెచ్‌ఈవో సత్యనారాయణరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

దుబ్బాకను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

● **ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి**

దుబ్బాక,ఫిబ్రవరి27: దుబ్బాక పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం దుబ్బాక మున్సిపాలిటీ కార్యాలయంలో నిర్వహించిన 2024-25 బడ్జెట్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దుబ్బాక నుంచి హబ్సీపూర్ వరకు ఫోర్‌లైన్ రోడ్డుతోపాటు దుబ్బాక పట్టణం చుట్టూ రింగ్ రోడ్డును ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దుబ్బాక వందపడకల ఆస్పత్రికి వచ్చే రోగులకు పూర్తిస్థాయి వైద్యాన్ని అందిస్తామని తెలిపారు. వారాంతపు సంతకు కోసం స్థల పరిశీలనతో పాటు నిర్వహణలో లోటుపాట్లు లేకుండా చూడాలని తెలిపారు. దుబ్బాక చుట్టూ ఉన్న చెరువులను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతామన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తిచేయాలని తెలిపారు. అనంతరం దుబ్బాకలోని 15వవార్డులో ప్రమాదశాత్తు గాజుల నరేష్ ఇల్లు కాలిపోసిన విషయాన్ని తెలుసుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వనితాభూంరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ సుగుణ, కమిషనర్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కొత్తప్రభాకర్‌రెడ్డి

మిషన్ భగీరథ పైప్‌లైన్ ధ్వంసం

● **ఎగసిపడిన నీరు, పరుగులు తీసిన వ్యాపారులు**

చేర్యాల, ఫిబ్రవరి27: అనాలోచిన చర్యలతో మిషన్ భగీరథ పైప్‌లైన్ ధ్వంసం అయింది. చేర్యాల పట్టణంలో జనగామ-సిద్దిపేట జాతీయ రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. ముందస్తు ప్రణాళికా లేకుండా, అనాలోచిత చర్యలు చేపడుతుండటం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పాడవకుండా వరదనీరు మళ్లించేందుకు భూమి ఎత్తు,పల్లాలు బేరీజుతో డ్రైన్‌కాలువల నిర్మాణం చేపడుతున్నారు. కానీ స్థానిక ఓల్డ్ పెట్రోల్‌పంప్ ఏరియాలో గతంలో కల్వర్టు లేకపోయినా, నూతనంగా పనులు చేపట్టేందుకు ప్రయత్నించగా, చుట్టుపక్కల ప్రజలు, వ్యాపారులు అభ్యంతరం తెలిపారు. కానీ మంగళవారం సంబంధిత అధికారులు పనులు ప్రారంభించారు. మిషన్ ఆపరేటర్‌తో పాటు కాంట్రాక్టర్‌కు సరైన అవగాహన లేకుండా గోతీ తీస్తుండగా మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలిపోయింది. దీంతో నీరు ఒక్కసారిగా ఎగసిపడడంతో దుకాణాదారులు భయంతో పరుగులు పెట్టారు. కాసేటికి మిషన్ ఆపరేటర్ ఎక్స్‌కవేటర్ బకెట్‌ను అడ్డుపెట్టి నీరు ఎగజిమ్మకుండా చర్యలు తీసుకున్నపటికీ నీటి ప్రవాహ ఉధృతికి కొంతమేర రోడ్డుదెబ్బతింది. ఇదిలా ఉండగా, సదరు ప్రదేశంలో కొద్దిరోజులక్రితమే బీటీ పూర్తి చేసినప్పటికీ లేని కల్వర్టు పేరిట తిరిగి గోతులు తీసి నిర్మాణం చేపడుతుండటం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఎగిసిపడుతున్న నీటిని అదుపు చేసేందుకు ఎక్స్‌కవేటర్ బకెట్ అడ్డు పెట్టిన దృశ్యం

ముందుకు సాగని ఆలయాభివృద్ధి పనులు

● **పట్టించుకోని ప్రభుత్వం, పాలకులు**

మద్దూరు, ఫిబ్రవరి 27 : బెక్కల్ రామలింగేశ్వరస్వామి ఆలయానికి ప్రభుత్వ ఆదరణతో పాటు దేవాదాయశాఖ కరుణ కురువైంది. గత ప్రభుత్వం పురాతన ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్న నేపథ్యంలో ఐదేళ్ల క్రితం బెక్కల్‌లోని రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని అప్పటి మంత్రి హరీశ్‌రావు సందర్శించి ఆలయాభివృద్ధికి రూ.5 కోట్లతో విడుతల వారీగా అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. మొదటి విడుతలో రూ. 80 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. హరీశ్‌రావు అప్పటి ఆలయచైర్మన్ ప్రస్తుత మాజీ సర్పంచ్ కూకట్ల బాలరాజ్‌కు రూ. 50 లక్షల ఉత్తర్వు కాపీని అందజేశారు. కాగా రూ. 80 లక్షల నిధులకు కనీసం రూ. 16 లక్షలు కంట్రిబ్యూషన్ కడితేనే నిధులు మంజూరు అవుతాయని దేవాదాయశాఖాధికారులు తెలుపడంతో హరీశ్‌రావు దృష్టికి ఆలయకమిటీ తీసుకెళ్లింది. దీంతో రూ. 50 లక్షలకు కంట్రిబ్యూషన్ మినహాయింపు కింద మంత్రి హరీష్‌రావు దేవాదాయశాఖకు లేఖ అందజేశారు. దీంతో నిర్మాణ పనులు మొదలు కానున్నాయని భావించిన ఆలయకమిటీకి ముందస్తుగా అసెంబ్లీ రద్దు కావడంతో నిరాశకు లోనయ్యారు. ఈ లోపు అసెంబ్లీ ఎన్నికలు రావడం ప్రభుత్వం మారడంతో ఆలయాభివృద్ధిపై నీలినీడలు కమ్ముకున్నాయి. జాతర ప్రారంభానికి ముందే నూతన కమిటీని ఎన్నుకోవాల్సి ఉండగా, కాంగ్రెస్ పార్టీ ఆ దిశలో చర్యలు చేపట్టకపోవడంతో కమిటీ లేకుండానే ఆలయం జాతర కొనసాగడం గమనార్హం.



బెక్కల్ రామలింగేశ్వరస్వామి ఆలయం

ప్రజావసరాలకు పెద్దపీట వేయాలి

● **మునిసిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య**



సమిక్షలో మాట్లాడుతున్న కమిషనర్ నరసయ్య

గజ్వేల్, ఫిబ్రవరి 27: ప్రజావసరాలకు పెద్దపీట వేయాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ సిబ్బందికి కమిషనర్ గొల్కొండ నరసయ్య సూచించారు. గజ్వేల్ పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో మంగళవారం ఆయన మునిసిపల్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. నీటి సరఫరాలో ఇబ్బందులు ఉండొద్దని, విద్యుత్ దీపాలు వెలుగని చోట వెంటనే కొత్త దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా టెండర్లు పూర్తైన సీసీ రోడ్ల పనులను, అసంపూర్తిగా ఉన్న సీసీ రోడ్ల పనులను వెంటనే పూర్తి చేయాలని ఇంజినీరింగ్ సిబ్బందికి సూచించారు.

ఐఈఆర్పీలను క్రమబద్ధీకరించాలి

● **పీఆర్టీయూ ఐఈఆర్పీ యూనియన్ రాష్ట్ర బాధ్యుడు పిల్లి లక్ష్మణ్**

మద్దూరు. ఫిబ్రవరి 27: కాంట్రాక్ట్ పద్ధతిన గత 20 యేళ్ల క్రితం నియామకమై దివ్యాంగ పిల్లలకు విద్యాబోధన చేస్తున్న ఐఈఆర్పీలను ప్రభుత్వం మంజూరు చేసిన 1,523 ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టులకు క్రమబద్ధీకరించి మిగతా పోస్టులకు నోటిఫికేషన్ వేయాలని పీఆర్టీయూ టీఎస్ ఐఈఆర్పీ యూనియన్ రాష్ట్ర బాధ్యుడు పిల్లి లక్ష్మణ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన మద్దూరులో విలేకరులతో మాట్లాడారు. అన్ని అర్హతలు కలిగిన ఐఈఆర్పీలకు మానవతా దృక్పదంతో న్యాయం చేయాలని కోరారు. స్పెషల్ బీఈడీ, డీఈడీ కలిగి నోటిఫికేషన్ ద్వారా పరీక్ష రాసి రోస్టర్ కమ్ రిజర్వేషన్ పద్ధతిలో నియామకమైనట్లు ఆయన గుర్తు చేశారు. క్రమబద్ధీకరణ చేయకుండా నోటిఫికేషన్ వేస్తే ఉద్యోగాలు కోల్పోవల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



ఉపాధ్యాయుల వేషధారణలో విద్యార్థులు

చిన్నకోడూరు, ఫిబ్రవరి 27: మండలంలోని అనంతసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించి, బహుమతులు ప్రదానం చేశారు.

సేవకు మించిన తృప్తి లేదు



అవార్డ్స్ అందజేస్తున్న ప్రతినిధులు

సిద్దిపేటరూరల్, ఫిబ్రవరి 27: సేవకు మించిన తృప్తి మరొకటి ఉండదని అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ డైరెక్టర్ మోహన్‌రావు పేర్కొన్నారు. మంగళవారం సిద్దిపేటలో జిల్లా గవర్నర్ సోమ వనజ ఆధ్వర్యంలో జరిగిన రీజినల్ అవార్డ్స్ ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మనిషి ఎంత సంపాదించినా నిరుపేదలకు చేసిన సేవ ద్వారా కలిగే తృప్తి మాటల్లో చెప్పలేమన్నారు. సిద్దిపేట రీజనల్ క్లబ్ పరిధిలో అలయన్స్ క్లబ్ ప్రతినిధులు చేసిన సేవా కార్యక్రమాలు ఇంటర్నేషనల్ అలయన్స్ క్లబ్‌కి ఆదర్శంగా నిలిచాయన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేసి ప్రజలకు మరింత దగ్గర కావాలని సూచించారు. అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ బాల గంగాధర్ శాస్త్రి మాట్లాడుతూ సమాజ సేవ చేసేందుకే అలయన్స్ క్లబ్ ఏర్పడిందన్నారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలందించిన అలయన్స్ క్లబ్ ప్రతినిధులకు జిల్లా, రీజనల్, జోనల్, క్లబ్‌స్థాయి అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ఆలయన్స్ క్లబ్ ప్రతినిధులు ఆత్మ రాములు, అంజయ్య, వైకుంఠం, శివకుమార్, ఇంటర్నేషనల్ క్లబ్ ప్రతినిధులు మధుసూదన్, రాజేంద్రప్రసాద్, పడాల సతీష్ కుమార్, మంత్రి లింగమూర్తి, రీజనల్ ప్రతినిధులు నాగభూషణం, వెంకటేష్, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.